

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం 6:25(సాయంత్రం)

సెహరీ : శనివారం 4:48 (ఉదయం)

కార్యకర్తల త్యాగం మరువలేం



- వారి సేవలు చిరకాలం గుర్తుంటాయి
- జగన్ హయాంలో రాష్ట్రం నాశనం
- నిరుద్యోగులుగా మారుతున్న యువత
- చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి
- పాణ్యం, బేతంచెర్ల మండలాల్లో 'నిజం గెలవాలి'

బేతంచెర్ల/ పాణ్యం, ఏప్రిల్ 4: ఐదేళ్లుగా రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను ఎదుర్కొంటూ, అవమానాలను తట్టుకుని నిలబడ్డ టీడీపీ కార్యకర్తల త్యాగాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కార్యకర్తల కష్టాన్ని కలకాలం గుర్తుంచుకుంటామని, వారి సేవలకు గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా గురువారం నారా భువనేశ్వరి బేతంచెర్ల, పాణ్యం మండలాల్లో పర్యటించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో అసువులు బాసిన కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. నారా భువనేశ్వరి రాగానే టీడీపీ శ్రేణులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె బేతంచెర్ల మండలంలోని హెచ్. కొట్టాల గ్రామంలో చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త పువ్వాడి నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఇదే మండలంలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన తెలుగుబాల తుపాకుల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయా కుటుంబాలకు భరోసాపత్రాన్ని అందజేసి కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన బోనిగెని శివరాముడు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. బొనిగేని శివరాముడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివరాముడు భార్య వెంకటలక్ష్మమ్మ, కుమార్తెలు విజయలక్ష్మి, శివరాణి, సంధ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీఈడీ పూర్తిచేసిన సంధ్యకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా బాధ్యతను తీసుకుంటామని అన్నారు. భువనేశ్వరి వెంట డోన్, పాణ్యం టీడీపీ అభ్యర్థులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, గౌరు చరిత, నంద్యాల టీడీపీ పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ నాయకుడు మంచివాడైతేనే ప్రజలు, రాష్ట్రం బాగుపడుతుందన్నారు. వైసీపీ పాలనలో నవరత్నాల పేరుతో గంజాయి, మాదక ద్రవ్యాల వ్యాపారం, ల్యాండ్ మాఫియా, కల్తీ మద్యం వ్యాపారం విచ్చలవిడిగా మారిందన్నారు. భావితరాల భవిష్యత్తును చంద్రబాబు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపి అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు గణపం జయరామిరెడ్డి, జనసేన నాయకులు జగదీశ్‌బాబు, మాజీ సర్పంచ్ హనుమంతు, సునీల్, బేతంచెర్ల టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి,చంద్రశేఖర్ రవీంద్ర నాయక్, మేకల నాగరాజు, రూబెన్ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



బేతంచెర్లలో నారా భువనేశ్వరిని చూసేందుకు తరలివచ్చిన ప్రజలు, అభిమానులు





గోరుమానుకొండ గ్రామంలో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో నారా భువనేశ్వరి, మాట్లాడుతున్న భువనేశ్వరి, పక్కనే కోట్ల, శబరి



పువ్వాడి నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తూ...



శివరాముడు కుటుంబ సభ్యులతో భువనేశ్వరి, గౌరు చరిత

బుగ్గనకు ఎదురు దెబ్బ

టీడీపీలో చేరిన డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషణ్



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరుతున్న హరికిషణ్

డోన్, ఏప్రిల్ 4: డోన్ మున్సిపాలిటీలో మంత్రి బుగ్గనకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆయన ప్రాంతంలో అధికార వైసీపీని వీడి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. తాజాగా గురువారం డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికే హరికిషణ్ టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో హరికిషణ్, ఆయన అనుచరులు ఎద్దుపెంట వెంకటేశ్, నాగార్జున, హరీష్, 1వ వార్డు రఘునందన్ గౌడ్, బాలరంగడుతో పాటు వందలాదిగా తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి టీడీపీ కండువా వేసి కోట్ల దంపతులు పార్టీలోకి ఆహ్వానించారు. డోన్ పట్టణ వైసీపీ అధ్యక్షుడిగా కొట్రికే హరికిషణ్ పదేళ్ల పాటు పని చేశారు. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. ఆయన సతీమణి కొట్రికే పద్మజ వైసీపీ కౌన్సిలర్‌గా పని చేశారు. పార్టీ కోసం ఎంత కష్టపడినా గుర్తింపు లేదని హరికిషణ్ దంపతులు మంత్రి బుగ్గనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. టీడీపీలో చేరిన సందర్భంగా హరికిషణ్ మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశామన్నారు. అయినా ఆ పార్టీలో గౌరవం లేదన్నారు. బుగ్గనను ఓడించి కోట్ల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మద్దిరి రమణ, లక్ష్మీనారాయణ యాదవ్, చిట్యాల మద్దయ్యగౌడు, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, రంజిత్ కిరణ్, ఆర్‌ఈ బాబు తదితరులు పాల్గొన్నారు.

తీరు మారలేదు..!

- యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన
- వైసీపీ నేతలతో ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు
- వైసీపీకి అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు
- ఇప్పటికే 47 మందికి షోకాజ్ నోటీసులు, 17 మంది వలంటీర్ల తొలగింపు

నంద్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రభుత్వ యంత్రాంగంలో భాగస్తులు. ప్రతి ఐదేళ్లకు ఓసారి ఏదో ఒక పార్టీ అధికారంలోకి వస్తుంది. ఉద్యోగులు అధికార పార్టీకి కొమ్ము కాసేలా ఉండకూడదు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కచ్చితంగా నియమావళిని పాటించాల్సిందే! అయితే కొంతమంది ఉద్యోగులు ముఖ్యంగా సచివాలయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తీరు మాత్రం, తమకు ఏ కోడ్ వర్తించదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇక వలంటీర్లు అయితే పూర్తిగా వైసీపీ కార్యకర్తలుగానే ప్రవర్తిస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నా.. వీరి తీరులో మాత్రం మార్పు రావడం లేదు. అధికారులు మరింత నిఘా పెట్టి, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు.

● ఎందుకీ విచ్చలవిడితనం?

సాధారణంగా ప్రభుత్వ యంత్రాంగంలోని ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య ఓ సన్నటి గీత ఉంటుంది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పైఅధికారుల నుంచి కిందిస్థాయి వరకు ఉద్యోగులు ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇక కిందిస్థాయి వారు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అయితే పూర్తిగా వైసీపీ కార్యకర్తల్లా మారిపోయారన్న అభిప్రాయమూ ఉంది. వైసీపీ నాయకులతోపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. వారికి అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ మద్దతునిస్తున్నారు. వైసీపీ వచ్చాక నేతల ద్వారా పరోక్షంగా లబ్ధిపొందిన వారిలో ఉన్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ స్వామి భక్తిని ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక వలంటీరు ఉద్యోగాలు దాదాపు వైసీపీ కార్యకర్తలకే వచ్చాయి కాబట్టి.. వీరి వ్యవహార శైలి వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ఆ పార్టీ తరఫున ప్రచారం సైతం నిర్వహిస్తుండటం గమనార్హం. వలంటీర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ స్థాయి విచ్చలవిడితనాన్ని ప్రదర్శిస్తే, ఒకవేళ వైసీపీ అధికారంలోనికి రాకపోతే అప్పుడు వీరంతా ఏం చేస్తారనే ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వీరంతా తమ పరిధిలో ఉండి ఉద్యోగ ధర్మం పాటిస్తే మేలన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

● పట్టని నిబంధనలు..

అసలు వలంటీరు వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పక్కాగా తమ స్వార్థపూరిత రాజకీయాల కోసమే తీసుకువచ్చిందన్న ఆరోపణలు మొదటి నుంచీ ఉన్నాయి. పైగా వారిని తమ పార్టీ కార్యకర్తలుగా వాడుకునేందుకు ప్రజా ధనాన్ని జీతంగా కూడా ఇస్తోందన్న అభిప్రాయమూ ఉంది. అయితే ఈ మాటలను అధికార పార్టీ ఏనాడు లెక్కపెట్టకుండా వలంటీర్లను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటూనే ఉంది. వలంటీర్ల వ్యవహార శైలిని గమనిస్తున్న ఎన్నికల కమిషన్ పార్టీ ప్రచారాల్లో గానీ, ఎన్నికల విధుల్లో గానీ పాల్గొనరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వీరితో పాటు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏవోలు, రేషన్ షాపు డీలర్లను కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఆదేశించింది. ఈ నాలుగు కేటగిరీల వాళ్లు క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధం ఉన్నవారే.. ప్రజలను ప్రభావితం చేయగలిగిన వారే! ఈ కారణంగా ఎన్నికల కమిషన్ ఈ కేటగిరి వారు హద్దు మీరితే శాశ్వతంగా తొలగించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఇలాంటి ఆదేశాలు ఉన్నా, ఆయా ఉద్యోగులు హద్దు మీరుతూనే ఉన్నారు.



తిమ్మాపురం గ్రామ సచివాలయ వాట్సాప్ గ్రూపులో అడ్మిన్ నంబరుతో వైసీపీ అనుకూలంగా పోస్టులు

● వైసీపీ సేవలో: ఈ ఐదేళ్ల పాలనలో వైసీపీ విధానాల వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటు వేసే ఉద్దేశంతో లేరు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలతో ఎక్కువగా టచ్‌లో ఉన్న వలంటీర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏవోలు, రేషన్ షాపు డీలర్లతో తమకు అనుకూలంగా ప్రచారం చేసుకోడానికి వైసీపీ సిద్ధమైంది.

● ఎందుకు వచ్చిన తంటా?: ప్రస్తుత అధికార పార్టీతో ఇంతగా కలిసి తిరగడం వల్ల తంటా వస్తుందని వలంటీర్లకు, ఉద్యోగులకు అర్థం కావడం లేదు. ప్రస్తుతం వైసీపీ నేతలకు పావులుగా ఉపయోగపడుతున్న వారంతా.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటని ఆలోచిస్తే బాగుండని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● 17 మంది వలంటీర్లపై వేటు: నంద్యాల జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్న 17 మంది వలంటీర్లను అధికారులు తొలగించారు. ఇక 47 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

రూ.91 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ

బనగానపల్లె/ నంద్యాల క్రైం, ఏప్రిల్ 4: బనగానపల్లె మండలంలోని పసుపుల గ్రామ సమీపంలోని చెక్ పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.91లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సీఐ సుబ్బారావు గురువారం తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో అనేక చోట్ల పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. విజిబుల్ పోలీసింగ్ గురువారం తెల్లవారుఝామున 3 గంటల ప్రాంతంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పసుపుల గ్రామం వద్ద ఓ లారీని తనిఖీ చేశామని అన్నారు. డ్రైవర్ సయ్యద్ మహబూబ్‌బాషా బెంగళూరు నుంచి లారీతో వస్తుండగా బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. లారీని తనిఖీ చేయగా అందులో ఒక బాక్సులో నగదును గుర్తించారు. ఈ నగదుకు సరైన పత్రాలు లేకపోవడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం పంచనామా నిర్వహించి రూ.91 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ నగదును ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది అప్రమత్తతవల్లే నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకోగలుగుతామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు.

శ్రీశైలంలో రేపటి నుంచి ఉగాది ఉత్సవాలు

● నేటితో ముగియనున్న మల్లన్న స్పర్శదర్శనం ● ఉత్సవాల్లో అలంకార దర్శనం మాత్రమే



మల్లన్న దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

శ్రీశైలం, ఏప్రిల్ 4: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం నుంచి ఉగాది మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఐదురోజులపాటు జరిగే ఈ మహోత్సవాలు 6న స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమై 10న ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిణి భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవార్లకు వివిధ వాహన సేవలు, 8వ తేదీన ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, ఉగాదిరోజు 9న ఉదయం పంచాగశ్రవణం, పండిత సత్కారం, సాయంకాలం రథోత్సవం జరపనున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉగాది ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం మాత్రమే స్పర్శదర్శనాన్ని కల్పిస్తారు. రేపటి నుంచి కేవలం అలంకార దర్శనం మాత్రమే ఉంటుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివస్తున్నారు. గురువారం శ్రీశైలంలో కన్నడ భక్తుల రద్దీతో క్షేత్రవీధులన్నీ నిండుగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం పాదయాత్ర మార్గంలో, క్షేత్ర పరిధిలో కన్నడ భక్తబృందాలు, స్వచ్ఛందసేవా సంస్థలు అన్నదాన శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే గురువారం నాటికి 30 వేలకు పైగా భక్తులు పాదయాత్రగా క్షేత్రాన్ని చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మల్లన్న వాహనసేవలు ఇలా...

- 6న భృంగివాహన సేవ, మహాలక్ష్మీ అలంకారం
- 7న కైలాసవాహన సేవ, మహాదుర్గ అలంకారం
- 8న నందివాహన సేవ, మహాసరస్వతి అలంకారం, ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం
- 9న పంచాగశ్రవణం, రథోత్సవం, అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం
- 10న అశ్వవాహనసేవ, భ్రమరాంబాదేవి నిజఅలంకరణ, పూర్ణాహుతి



శ్రీశైలం క్షేత్రవీధుల్లో భక్తుల రద్దీ



కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్న ఈఓ పెద్దిరాజు



పాతాళగంగ వద్ద పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు





కాలి నడకన కావడితో వస్తున్న కన్నడిగులు

బుజ్జగింపుల పర్వం

టికెట్ తమకే అని కొండంత ఆశతో ఉన్నవారికి నిరాశ ఎదురైంది. టీడీపీ అధి నాయకత్వం వేరే వాళ్లకు ఇచ్చింది. పొత్తులో ఒప్పందాలు, సామాజిక సమీకరణాలు కలిసి కొందరు ఆశావహులను పక్కన పెట్టింది. దీంతో అసంతృప్తి చెందిన నాయకులను బుజ్జగించి అభ్యర్థులను గెలిపించాలని సూచిస్తూ పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు ఒక బృందాన్ని పంపించారు. వాళ్లు అసంతృప్తితో ఉన్న నాయకులను కలిసి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

- టికెట్ రాని నాయకులను కలిసిన టీడీపీ బృందం
- సర్దుబాటు ప్రయత్నాలు షురూ
- ఒకట్రెండు రోజుల్లో అన్ని సర్దుకుంటాయి - బీటీ నాయుడు

● మంత్రాలయం టీడీపీ టికెట్ ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పి. తిక్కారెడ్డి ఆశించారు. ఈయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు ఉలిగయ్య కూడా ప్రయత్నించారు. సామాజిక సమీకరణల్లో భాగంగా బోయ (వాల్మీకి) సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎన్. రాఘవేంద్రరెడ్డిని బరిలో దింపారు.

● ఆదోని టికెట్ టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ మదిరె భాస్కరరెడ్డి, ఏపీ ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ సహా పలువురు నాయకులు ఆశించారు. పొత్తుల్లో భాగంగా బీజేపీ కేటాయించడంతో ఆ పార్టీ బోయ (వాల్మీకి) సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పీవీ పార్థసారథికి టికెట్ ఇచ్చింది.

● కోడుమూరు (ఎస్సీ) టీడీపీ టికెట్ తనకే వస్తుందని ఆ పార్టీ ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్ గట్టి నమ్మకంతో ఉంటూ వచ్చారు. ఆయనకు ఒక కీలక నాయకుడి మద్దతు కూడా ఉంది. రాజకీయ మార్పుల దృష్ట్యా అధినేత చంద్రబాబు బొగ్గుల దస్తగిరిని అభ్యర్థిగా తొలి జాబితాలోనే ప్రకటించారు.

● ఆలూరు టీడీపీ టికెట్ తనకే వస్తుందని ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ధీమాగా ఉంటూ వచ్చారు. మాజీ ఇన్‌చార్జిలు వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం ప్రసాద్ సతీమణి జ్యోతి కూడా తీవ్రంగా ప్రయత్నం చేశారు. రాజకీయ, సామాజిక సమీకరణాలు దృష్ట్యా వీర శైవ లింగాయత్ సామాజికవర్గానికి చెందిన బి. వీరభద్ర గౌడ్‌ను అభ్యర్థిగా నాలుగో విడతలో అధిష్ఠానం ప్రకటించింది.

కర్నూలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పార్లమెంట్ పరిధిలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు టికెట్ల కేటాయించిన పద్ధతి వల్ల టికెట్ దక్కిన వారికి ఆనందం.. రాని వారిలో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. టికెట్లు కేటాయించడానికి వివిధ సర్వేలు, రాజకీయ, సామాజిక సమీకరణాలు, పొత్తులు పని చేశాయని చెప్పవచ్చు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమ కేసులు ఎదురొడ్డి పోరాడితే చివరి క్షణంలో అన్యాయం చేశారంటూ ఇన్‌చార్జిలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకరిద్దరు రెబల్‌గా మారడమా..? అనే డైలమాలో పడ్డారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు అధి నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఆదివారం ఎమ్మిగనూరులో అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం జన వెల్లువై విజయగళంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని గ్రహించిన అధిష్ఠానం అసంతృప్తులకు గురైనవారిని బుజ్జగించే పని చేపట్టింది. అందులో భాగంగానే జిల్లాలో అధిష్ఠానం పంపించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు నేతృత్వంలో జోన్-5 ఇన్‌చార్జి బీదా రవిచంద్రయాదవ్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కడప జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి బృందం బుజ్జగింపులు ప్రారంభించారు.

● అధిష్ఠానం దూతలుగా..

టీడీపీ అధి నాయకత్వం పంపిన బృందం ఆదోని నియోజకవర్గం టికెట్ రాక నిరాశతో ఉన్న ఆ పార్టీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడు సహా గుడిసె కృష్ణమ్మ, మదిరె భాస్కరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎలాంటి పరిస్థితుల్లో ఆదోని టికెట్ బీజేపీకి ఇవ్వాల్సి వచ్చిందో వివరించారు. పొత్తు ధర్మం పాటిస్తూ బీజేపీ అభ్యర్థి డాక్టర్ పీవీ పార్థసారథి గెలుపు కోసం పని చేయాలని, ఇది అధిష్ఠానం సందేశం అని స్పష్టత ఇచ్చారు. అదే క్రమంలో వారి ఆవేదనను కూడా ఆలకించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి, ఆయన వర్గీయులతో మంత్రాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. రాయలసీమలో వాల్మీకులు అధికంగా ఉండడం వల్లే ఆ సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డికి టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని ఆ బృందం వారికి చెప్పింది. అయితే.. టికెట్ విషయంలో పునరాలోచించి తిక్కారెడ్డికే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేశారు. వాల్మీకులకే ఇవ్వాల్సి వస్తే పార్టీ కోసం కొన్నేళ్లుగా పని చేస్తున్న అదే సామాజిక వర్గానికి చెందిన ఉలిగయ్య, బసలదొడ్డి ఈరన్న, కోసిగి వక్రాణి వెంకటేశ్, మాధవరం అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు కదా అని ప్రశ్నించినట్లు తెలిసింది. కోడుమూరు (ఎస్సీ) టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీ ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్, కోడుమూరు మండల కన్వీనర్ కోట్ల కవితమ్మలతో ప్రత్యేక బృందం సమావేశం అయ్యింది. ఇక్కడ కూడా అభ్యర్థి విషయంలో పునరాలోచన చేయాలని కోట్ల వర్గం చెప్పినట్లు సమాచారం. ఆలూరు టీడీపీ ఆశించి నిరాశ నిస్పృహలతో ఉన్న పార్టీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతిలతో పాటు వారి వర్గీయులతో భేటీ అయి బుజ్జగించినట్లు సమాచారం. అసంతృప్తితో ఉన్న నాయకులు అభిప్రాయాలను టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, నాయకులందరూ కలిసి కూటమి అభ్యర్థుల విజయానికి పని చేయాలని పార్టీ జోన్-5 ఇన్‌చార్జి బీదా రవిచంద్రయాదవ్ వెల్లడించినట్లు తెలుస్తోంది.

వ్యూహాత్మక అడుగులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల ఎంపీ స్థానాలు సహా 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2004కు ముందు టీడీపీకి కంచుకోట. ఆ తర్వాత రాజకీయ పరిణామాలు కారణంగా టీడీపీ సీట్లు తగ్గుతూ వచ్చాయి. 2014 ఎన్నికల్లో ఎమ్మిగనూరు, పత్తికొండ, బనగానపల్లె మాత్రమే విజయం సాధించింది. 2019లో ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. ఎలాగైనా కర్నూల్లో పూర్వవైభవం తీసుకొచ్చి కొండారెడ్డి బురుజుపై పసుపు జెండా ఎగురువేయాలనే లక్ష్యంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం నిర్వహించిన బాదుడే బాదుడు సభలకు జనం పోటెత్తి నిమా వర్గాలకే అంతుచిక్కని స్థాయిలో సక్సెస్ కావడంతో రాష్ట్రంలోనే టీడీపీకి జోష్ పెంచింది. యువనేత నారా లోకేశ్ పాదయాత్ర సూపర్ డూపర్ సక్సెస్ అయ్యింది. గత నెల 29న సీఎం జగన్ ఎమ్మిగనూరులో మేము సిద్ధం సభకు ఉమ్మడి జిల్లాలో వివిధ గ్రామాలకు 1,400 ఆర్టీసీ బస్సులు పంపి జనసమీకరణ చేస్తే.. జగన్ ప్రసంగిస్తుండగా జనం లేక సభా ప్రాంగణం వెలవెలబోయింది. ఒక్క రోజు తేడాతో 31న టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు తేరుబజారులో నిర్వహించిన ప్రజాగళం సభకు ఒక్క ఆర్టీసీ బస్సు పంపకపోయినా ఎమ్మిగనూరు నుంచి వెల్లువలా జనం తరలి వచ్చారు. తేరుబజారు, పురవీధులు జనం వరదలా కనిపించాయి. ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఓటుగా మార్చుకొని రెండు పార్లమెంట్ స్థానాలు సహా 8-10 స్థానాలకు తగ్గకుండా ఎమ్మెల్యేలు గెలవాలనే వ్యూహాలకు పదును పెట్టారు. అందులో భాగంగానే టికెట్ ఆశించిన నిరాశ చెందుతున్న అసంతృప్తిదారులను బుజ్జగించేందుకు చంద్రబాబు ప్రత్యేక బృందాన్ని పంపిచారని అంటున్నారు. అవసరం అయితే అధినేత చంద్రబాబు కూడా వారిని పిలిపించి మాట్లాడే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.



మంత్రాలయంలో టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి వర్గం సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

ఒకట్రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి

కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఆదోని, కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు పార్టీ ఇన్‌చార్జిలు టికెట్లు ఆశించారు. రాజకీయ, సామాజిక సమీకరణాలు వల్ల అధిష్ఠానం టికెట్లు ఇవ్వలేకపోయింది. నిరాశతో ఉన్న ఆశావహులను కలసి పార్టీ విజయం కోసం పని చేసేలా ఒప్పించమని మా బృందాన్ని పంపిన మాట నిజమే. ఆయా నియోజకవర్గాల నాయకులతో మాట్లాడాం. వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాం. రెండు మూరు రోజుల్లో అంతా సర్దుకుంటుంది. సమన్వయంతో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం నాయకులంతా పని చేస్తారని ఆశిస్తున్నాం.

\- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు వర్గంతో టీడీపీ కమిటీ నాయకులు

శ్రద్ధగా చదివితే జీవితంలో రాణిస్తారు

● ఆర్‌యూ రీజనల్ స్థాయి పోటీల్లో ఉప కులపతి




క్విజ్ విజేతలకు ప్రశంసా ప్రతాలను అందజేస్తున్న ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: చదువులో శ్రద్ధ ఉన్నప్పుడే జీవితంలో విజయం సాధిస్తారని ఉపకులపతి టీ. సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో సెనేట్ హాల్లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి క్విజ్ ఛాంపియన్ షిప్పు-2024 రీజనల్ క్వాలిఫైర్స్ రౌండును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. అందులో భాగంగానే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ఇలాంటి క్విజ్ పోటీలకు ఉన్నత విద్యామండలి రూపకల్పన చేసి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నదని అన్నారు. ఈ ఏడాది రీజనల్ స్థాయి పోటీల నిర్వహణను రాయలసీమ యూనివర్సిటీకి అప్పగించిందని తెలిపారు. ఈ పోటీల్లో రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లా నుంచి 14 కళాశాలల బృందాలు హాజరయ్యాయని తెలిపారు. అందులో కర్నూలు సెయింట్ జోసెఫ్ కళాశాల, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల. జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. త్వరలో విజయవాడలో జరిగే సెమి ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించాయన్నారు. విజేతలకు రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎన్. అంకన్న ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి అకడమిక్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్, చంద్రమోహన్‌రెడ్డి, ప్రొఫెసర్లు సీవీ కృష్ణారెడ్డి, వై. హరిప్రసాద్‌రెడ్డి, సుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్ కుమార్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

28న ఏపీ సెట్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: ఏపీ సెట్ పరీక్షలు 28న నిర్వహిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్, రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తెలిపారు. గురువారం పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరీక్షలకు సంబంధించిన 9 సెంటర్లు ఏర్పాటు చేశామని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి పరీక్ష కేంద్రాలు కేటాయించామని పేర్కొన్నారు.

టీజీవీ కళాక్షేత్రం నాటకానికి 'నందిని' అవార్డులు



జ్ఞాపిక అందుకుంటున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా, మిర్యాలగూడలో, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 'నందిని' నాటకోత్సవాల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులకు అవార్డుల పంట పండింది. గురువారం రాత్రి ఈ అవార్డులను ప్రకటించి, కళాకారులను అందజేశారు. గత వారం రోజులుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటక సమాజాలు ఈ ప్రదర్శనల్లో పోటీ పడగా, టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటకం జాతీయ స్థాయి పద్య నాటక విభాగంలో ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది. అలాగే ఈ నాటకంలో నటించిన కళాకారులకు వ్యక్తిగత విభాగంలో 6 నందిని బహుమతులు సొంతం చేసుకున్నారు. ఉత్తమ ద్వితీయ నాటకంగా నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య అవార్డు అందుకోగా, వ్యక్తిగత అవార్డులను వరుసగా ఉత్తమ నటుడు జీవీ శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి సురభి ప్రభావతి, ఉత్తమ సహాయ నటుడు పి. రాజారత్నం, ఉత్తమ సహాయ నటి హసీనా, ఉత్తమ ఆహార్యం (మేకప్) చింతా శ్రీనివాసులు, ఉత్తమ రచన పల్లేటి కులశేఖర్ అందుకున్నారు. పౌరాణిక పద్య నాటకాల్లో ఏడు అవార్డులు సాధించిన టీజీవీ కళాక్షేత్రం కళాకారులను విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య అభినందించారు.

లోక్ అదాలత్ న్యాయాధికారి బదిలీ

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 4: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి 39 మంది సీనియర్ సివిల్ న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మూడు సంవత్సరాలుగా ఆయన కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. దీంతో సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గుంటూరు జిల్లా సత్తెనపల్లి కోర్టుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గుంటూరు జిల్లా గురజాలలో పని చేస్తున్న బి.లీలా వెంకటశేషాద్రిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖాళీగా ఉన్న ఆదోని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా విజయనగరం జిల్లా పార్వతీపురంలో పని చేస్తున్న యజ్ఞ నారాయణను నియమించింది.

వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు ఎదురు దెబ్బ

- రూ.360 కోట్లు అప్పు చెల్లించలేదని స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం
- పబ్లిక్ నోటీస్ జారీ చేసిన ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్



కర్నూలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు ఎన్నికల సమయంలో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ భారీ షాక్ ఇచ్చింది. బుట్టా రేణుక, ఆమె భర్త బీఎస్ నీలకంఠ పేరిట తీసుకున్న అప్పు రూ.360 కోట్లు చెల్లించకపోవడంతో.. ష్యూరిటీగా పెట్టిన 15 స్థిరాస్తులను అమ్మకం కోసం బెంగళూరుకు చెందిన ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ఈ-వేలం అమ్మకం ప్రకటన జారీ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏ ఇద్దరు కలసినా దీనిపైనే ప్రధానంగా చర్చించుకోడం కొసమెరుపు. ఈ నెల 29న వైసీపీ అధినేత, సీఎం జగన్ ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో నిర్వహించిన మేము సిద్ధం సభలో కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులను పరిచయం చేశారు. 'ఈ నియోజకవర్గానికి (ఎమ్మిగనూరు) చెందిన బుట్టమ్మ నా చెల్లెలు సౌమ్యురాలు.. బీసీ కులానికి చెందిన నా చెల్లెమ్మ.. ఆర్థికంగా కూడా మాత్రం అంతంత మాత్రంగానే ఉంది..' అంటూ పేదరాలిగా పరిచయం చేసే ప్రయత్నం చేశారు సీఎం జగన్. గతంలో బుట్టా రేణుక, ఆమె కుమారుడు ఓ యూట్యూబ్ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన ఆస్తుల వివరాలు, సీఎం జగన్ మాటలు జోడించి సోషల్ మీడియాలో తెగ ట్రోలింగ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా బుట్టా రేణుకకు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ భారీ షాక్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా (హైదరాబాద్)లో బుట్టా రేణుక, ఆమె భర్త బీఎస్ నీలకంఠ పేరిట ఉన్న వివిధ స్థిరాస్తులను తాకట్టు పెట్టి 1995 నుంచి 2012 వరకు పలు దఫాలుగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో అప్పులు తీసుకున్నారు. తీసుకున్న అప్పు వడ్డీతో సహా రూ.360 కోట్లు చెల్లించాలని 2019 నవంబరు 18న డిమాండ్ నోటీస్ జారీ చేసినట్లు ఆ సంస్థ ఇచ్చిన ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ రాజధాని హైదరాబాదులో ఓ ప్రధాన పత్రికలో ఎల్ఐసీ హెచ్ఎఫ్‌సీ బెంగళూరు మేనేజరు గురువారం ఈ-వేలం అమ్మకం ప్రకటన ఇచ్చింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. రూ.360 కోట్లు ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ హెచ్ఎఫ్‌సీకి చెల్లించాల్సిన బుట్టా రేణుక ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉందంటూ.. ఆమెను ఓ పేదరాలిగా సీఎం జగన్ నమ్మించే ప్రయత్నం చేయడం రాజకీయ నాయకులకు చెల్లు అంటూ పట్టణ ప్రజలు చర్చించుకోవడం కొసమెరుపు. ఈ విషయంపై ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక వివరణ కోసం ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అన్ని స్థానాల్లో టీడీపీని గెలిపిద్దాం

కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 4: కర్నూలు పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను కష్టపడి గెలిపించుకుందామని ఎంపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో గురువారం సాయంత్రం సర్పంచు గొల్ల మాధవి అధ్యక్షతన పంచలింగాల, దేవమాడ, గొందిపర్ల, ఈ.తాండ్రపాడు గ్రామాల ఆధ్వర్యంలో టీడీపీ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, బీజేపీ మహిళా నాయకురాలు గీతామాధురిరెడ్డి, జనసేన నాయకులు రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సామన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి టీడీపీ అధినేత చంద్రబాబు ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించారు. అలాంటి పెద్దాయన మాటను నిలబెట్టాలంటే ఈఎన్నికల్లో మీబిడ్డగా ఆశీర్వదించి చట్టసభలకు పంపాలని కోరారు. ఒక్క చాన్స్‌పేరుతో గద్దెనెక్కిన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశాడన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆదాం, వై.కృపాదానం, నాగరాజు, సోమన్న, సత్యంయాదవ్, పంచలింగాల గొల్లకృష్ణ, పంచలింగాల లక్ష్మీకాంతరెడ్డి, జయసింహారెడ్డి వై.సంజీవరావు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉద్యోగికి జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 4: తీసుకున్న రుణానికి హామీగా ఇచ్చిన బ్యాంకు చెక్ బౌన్స్ కావడంతో దాఖలైన కేసులో ఓ ప్రభుత్వ ఉద్యోగికి 3 నెలల కారాగార శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోష్ణదేవి గురువారం తీర్పునిచ్చారు. కర్నూలు నగరంలో హంద్రీనీవా సుజల స్రవంతి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసే బి.వెంకటరమణయ్య 2016 సంవత్సరంలో అవసరాల కోసం రూ.3 లక్షలను అప్పుగా ఫిర్యాది విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి అయిన బీవీ వెంకట్రాముడు నుంచి అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత తీసుకున్న రుణానికి హామీగా మూడు ప్రామిసరి నోట్లను రాసిచ్చాడు. ఆ తర్వాత 2017లో రూ.3లక్షలకు మూడు బ్యాంకు చెక్కులను హామీగా ఫిర్యాదికి ఇచ్చాడు. ఫిర్యాది ఆ చెక్కులను వసూలు కోసం తన బ్యాంకులో దాఖలు చేయగా.. నిందితుడి ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో అవి బౌన్స్ అయ్యాయి. దీంతో ఫిర్యాది కోర్టులో కేసు దాఖలు చేశాడు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు నెలల జైలు, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

మంటలు చెలరేగి బైక్ దగ్ధం

\- యువకుడికి గాయాలు



కాలిపోతున్న బైక్

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 4: ఎమ్మిగనూరు పట్టణలోని మంత్రాలయం జాతీయ రాహదారి బియ్యం గోడౌన్ వద్ద గురువారం రాత్రి రన్నింగ్‌లో ఉన్న పల్సర్ బైక్‌లో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన వీరేష్ సొంతపని నిమిత్తం పత్తికొండ మండలం సింగారం గ్రామానికి పల్సర్ బైక్‌పై వెళ్లాడు. పని చూసుకొని తిరిగివస్తుండగా పట్టణంలోని మార్కెట్ కమిటీ సర్కిల్ వద్ద ఉన్నట్టుండి బైక్ ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. వీరేష్ వెంటనే బైక్‌పైనుంచి కిందకు దూకాడు. దీంతో బైక్ కొంత దూరం వెళ్లి రోడ్డుపై పడి మంటల్లో పూర్తిగా దగ్ధమైపోయింది. బైక్‌పై నుంచి దూకిన వీరేష్‌కు తలకు గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉగాదికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కర్నూలు(రూరల్)ఏప్రిల్4: ఉగాది పర్వదినం పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసులు ఈనెల 8నుంచి 10వతేది వరకు కర్నూలు జిల్లాల్లో 5డిపోల నుంచి శ్రీశైలం, ఇతర శైవక్షేత్రాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 115 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన వివరించారు. రాయచూర్-శ్రీశైలం 10, ఆదోని-శ్రీశైలం 30, ఎమ్మిగనూరు-శ్రీశైలం 25, కర్నూలు-శ్రీశైలం 50 సర్వీసులను కేటాయించినట్లు ఆయన వివరించారు. కాబట్టి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్(రూరల్), ఏప్రిల్ 4: పట్టణంలోని శ్రీరామనగర్‌కు చెందిన గంజాయి విక్రేతలను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శ్రీరామ నగర్‌కు చెందిన భరత్‌చంద్ర, బోయ విజయ్ అనే వ్యక్తులు పత్తికొండ ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి 1100 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి డోన్‌లో విక్రయించడానికి సిద్ధం అవుతుండగా.. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

నంద్యాలకు చేరుకున్న నారా భువనేశ్వరి

నంద్యాల రూరల్ ఏప్రిల్ 4: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు అరెస్టుతో పలువురు ఆ పార్టీ అభిమానులు గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంతో బాధితులను పరామర్శించటానికి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పరామర్శ యాత్ర నిర్వహిస్తున్నారు. కార్య క్రమంలో భాగంగా గురువారం నంద్యాల చేరుకున్న నారా భువనేశ్వరికి ఎన్ఎండి ఫరూక్, ఏవీఆర్ ప్రసాద్, టి. తులశిరె డ్డిలు స్వాగతం పలికారు. భువనేశ్వరి శుక్రవారం ఉదయం పట్టణంలోని 34, 13 వార్డులు పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం మహానందిలో పర్యటించి తిరిగి రా త్రి నంద్యాల ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో బస చేస్తారు. శనివారం ఉదయం అదే ఫంక్షన్ హాల్‌లలో మహిళలతో ముఖాముఖి నిర్వహించి పాణ్యం బయలుదేరి వెళ్తారు. నిజం గెలవాలి పర్యటనను విజయవంతం చేయాలని నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు.

'విజయవంతం చేయాలి'

నంద్యాల (నూనెపల్లె): నారా భువనేశ్వరి నంద్యాల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పిలుపు నిచ్చారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 13, 34 వార్డులలో పరామర్శిస్తారని చెప్పారు.

నేడు రాక

మహానంది: నంద్యాల జిల్లాల్లో నిజం గెలవాలి పర్యటనలో భాగంగా పర్యటిస్తున్న నారా భువనేశ్వరి శుక్రవారం మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వస్తున్నట్లు మహానంది మండల టీడీపీ నాయకుడు కంచెర్ల శివ, మహానంది ఇన్‌చార్జి సూరే శ్రీనివాసులు గురువారం తెలిపారు. టీడీపీ జాతీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతిచెందిన కుటుంబాలను పరామర్శించడంలో భాగంగా బుక్కాపురం గ్రామంలో మృతి చెందిన చిన్న మద్దిలేటి కుటుంబాన్ని పరామర్శిస్తారని చెప్పారు. అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని నారాయణపురం గ్రామానికి నారా భువనేశ్వరీ విచ్చేస్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల సునీత, మండల యూనిట్ ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గరాముడు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటలకు పరామర్శిస్తారని చెప్పారు. అనంతరం మహిళలతో మాట్లాడతారని వారు తెలిపారు. మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఫించన్ల పంపిణీలో వైసీపీ నీచ రాజకీయం ప్రజలు గమనిస్తున్నారని, ఎన్ని వేషాలు వేసినా జగన్‌ను నమ్మే స్థితిలో జనం లేరని అన్నారు.

నందికొట్కూరు: ఈనెల 6వ తేదీన మిద్తూరు మండలం నాగలూటి గ్రామానికి టీడీపీ అధినేత చంద్రబాబు నారా భువనేశ్వరి రానున్నారని నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి జయసూర్య తెలిపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అరెస్టు సమయంలో దిగ్భ్రాంతికి గురై చనిపోయిన టీడీపీ నాయకుడు డి.చిన్నమాసూం కుటుంబాన్ని పరామర్శించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆమె నాగలూటి గ్రామానికి వస్తారని తెలిపారు.


నంద్యాలలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న నాయకులు

అరాచక పాలనకు అంతం పలకాలి: బుడ్డా


ఈర్నపాడులో మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 4: అరాచక పాలనకు ఓటు అనే ఆయుధంతో అంతం పలకాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి మండలంలోని ఈర్నపాడు గ్రామంలో అన్నెం శంకర్‌రెడ్డి, సిద్దం ప్రతాపరెడ్డి, చింతకుంట శ్రీనివాసరెడ్డి, సోముల వీరనారాయణరెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, పిట్టం రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి ఎస్.ప్రతాపరెడ్డిలతో పాటు 120 కుటుంబాలు బుడ్డా సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే దళితవాలో శివ, తిమ్మయ్య, ఓబులేసు, సుందరం, కిషోర్, పెద్ద ఓబులేషుతో పాటు 40 దళిత కుటుంబాలు బుడ్డాకు గజమాలతో ఘనస్వాగతం పలికి టీడీపీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, చంద్రబాబును సీఎం చేసుకోవాలని బుడ్డా కోరారు. జగన్ నమ్మించి మోసం చేశారని, మళ్ళీ నమ్మితే నాశనం అవుతామని ప్రముఖ న్యాయవాది తులసిరెడ్డి, చింతల సుబ్బరాయుడు అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామకృష్ణారెడ్డి, బండి శీను, తిరుపాల్, శ్రీనివాసరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.


బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పింఛన్ పంపిణీలో వైసీపీ నాయకుడు


రికార్డును పరిశీలిస్తున్న ప్రవీణ్

నందికొట్కూరు ఏప్రిల్ 4: నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్‌లోని 7వ సచివాలయంలో అధికారులు పింఛన్ పంపిణీ చేస్తుండగా నందికొట్కూరు టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ బండారి ప్రవీణ్ అక్కడికి చేరుకొని పెన్షన్ రికార్డును పరిశీలిస్తు కనిపించారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయం ఎన్నికల అధికారుల దృష్టికి పోయినా కూడా స్పందన కరువైంది. వైసీపీ అనుబంధ సంఘాల నాయకులు జోక్యం చేసుకుంటూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించడంపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఏప్రిల్ 4: శ్రీశైల దేవస్థానం ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా క్షేత్రపరిధిలోని నిత్యకళారాధన వేదిక, ఆలయ పుష్కరిణి వేదిక, శివదీక్షా శిబిరాల వేదికల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనం(కన్నడ), భజన, భక్తిరంజని(కన్నడ), సంప్రదాయనృత్యం, గిరిజా కల్యాణం, నృత్యరూపకం, కథక్, భరతనాట్యం తదితర కార్యక్రమాలకు కళాకారుల ప్రదర్శన భక్తులను ఎంతగానో అకట్టుకుంది.

'ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి'

ఆత్మకూరు, ఏప్రిల్ 4: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా రాజకీయ పార్టీల నాయకుల ఎన్నికల ప్రచారాలకు, సభలకు, పర్యటనలకు సంబంధించి వినియోగించే వాహనాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని శ్రీశైలం నియోజకవర్గం ఎన్నికల సబ్ నోడల్ ఆఫీసర్, ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రవాణా శాఖ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు ఎన్నికల ప్రక్రియలో వినియోగించే వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా వైట్‌బోర్డు వాహనాలకు సంబంధించి వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ) ఇన్సూరెన్స్ పత్రాలతో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఎల్లో బోర్డుకు సంబంధించి పబ్లిక్, ట్రాన్స్‌పోర్టుకు వినియోగించే వాహనాలకు వాహన రిజిస్ట్రేషన్, ఇన్స్‌రెన్స్‌తో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా దరఖాస్తు పత్రంలో అన్ని వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే అనుమతులను రద్దు చేస్తామని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీల, స్వతంత్ర్యంగా బరిలో నిలిచే అభ్యర్థులు ఈప్రక్రియను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లేనిపక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇకపోతే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ప్రలోభాలకు గురిచేసేలా భారీ మొత్తంలో నగదు, అక్రమ మద్యం, గిఫ్టులు తదితర రవాణాపై గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రత్యేకించి అంబులెన్స్, పోలీసు, ప్రెస్, ఎమ్మెల్యే, ఎంపీ స్టిక్కర్లతో కూడిన వాహనాలను, లాజిస్టిక్ గూడ్స్ వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. పట్టుబడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వలంటీర్ల రాజీనామా

బండిఆత్మకూరు, ఏప్రిల్ 4: మండలంలోని సంతజూటూరులో 12 మంది. భోజనం గ్రామంలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో విజయరావు తెలిపారు. గురువారం వారంతా వ్యక్తిగతంగా మూకుమ్మడి రాజీనామాలు అందజేశారని, వీటన్నింటీనీ వెంటనే ఆమోదిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు ఐదు మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజీనామాలు ఆమోదించినట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి ప్రభుత్వం ద్వారా ఇచ్చిన సెల్‌ఫోన్, సిమ్‌కార్డు, వేలిముద్రల నమోదు యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

'జగ్జీవన్‌రామ్ జయంతిని జయప్రదం చేయాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 4: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఆత్మకూరు తాలుకా మాలమహానాడు అధ్యక్షులు పెరుమాల చింతలయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో జరిగే జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకకు ప్రజాసంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 12న మహాత్మాజ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని, ఆయా కార్యక్రమాలను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముగిసిన జాతీయ సదస్సులు

పాణ్యం, ఏప్రిల్ 4: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సాంకేతిక సదస్సులు గురువారం ముగిశాయి, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాలలో సదస్సులు ఏర్పాటు చేశారు. సివిల్ విభాగంలో ఏర్పాటు చేసిన సదస్సులో ప్రైమ్‌వేరా వర్క్‌షాప్, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, మోడల్ మేకింగ్, క్యాడ్ కాంటెస్ట్, కోడింగ్, స్పా ట్ ఈవెంట్స్‌లు, క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సదస్సులలో వివిధ కళాశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సివిల్ విద్యార్థులు తయారు చేసిన మోడల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. పేపర్ ప్రజంటేషన్ విజేతలకు నగదు బహుమతి, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీలు డాక్టర్ శ్రీనివాసులు, కన్వీనర్ సునందనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాములపాడు, ఏప్రిల్ 4: పాములపాడులోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవీంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గానూ పదో తరగతి ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు మే 22లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

తల్లీకొడుకుల అదృశ్యం

మిడుతూరు ఏప్రిల్ 4: మిడుతూరు గ్రామానికి చెందిన తల్లీ కొడుకులు అదృశ్యమయ్యారు. మిడుతూరు గ్రామానికి చెందిన 35 ఏళ్ల మరియమ్మ 13ఏళ్ల చరణ్ కనిపించడం లేదని భర్త ఏసోబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం: గౌరు


మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 4: బీసీలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందించకపోగా, బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా జగన్ అన్యాయం చేశారని, వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, మాండ్ర లింగారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య అన్నారు. మండలంలోని మండ్లెం గ్రామంలో మండల నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల క్లస్టర్ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై అక్రమకేసులు, దాడులు చేయించే జగన్ అభివృద్ధి చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని చంద్రబాబు, లోకేశ్ హామీ ఇచ్చారని అన్నారు. బీసీలకు ప్రాధాన్యత, న్యాయం జరిగేది టీడీపీలోనే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, గిరీశ్వరరెడ్డి, సర్పంచ్ కృపమ్మ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు


మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

గడివేముల, ఏప్రిల్ 4: మండలంలోని దుర్వేసి గ్రామంలో గురువారం సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, పాణ్యం నియోజకవర్గం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి వైసీపీ కార్యకర్తలైన కందుల బాలస్వామి, బాలబోయిన ప్రసాదు, చెన్నయ్య, రాముడు, శివ, జంబులు, నడిపి మద్దిలేటి, చిన్న మద్దిలేటి, బాలయ్య, సాయి, శివ, వెంకటేశ్వర్లుకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాస యాదవ్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీడీపీతోనే నాయి బ్రాహ్మణుల అభివృద్ధి'

పాములపాడు, ఏప్రిల్ 4: నాయి బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కిందని నాయి బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండలకేంద్రమైన పాములపాడులో సెలూన్ షాపులకు వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు నాయి బ్రాహ్మణులు కలసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ మండల నాయకులు లక్ష్మీనారయణ, వెంకటరమణ, వీరప్రసాద్, పెద్ద, చిన్న శేషన్నలు, తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను సాగనంపాలి: బైరెడ్డి


కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 4: రాష్ట్రంలోని వైసీపీ రాక్షస పాలనను సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. గురువారం నంద్యాలలోని 28వార్డు వైసీపీ నాయకుడు జానీ ఆధ్వర్యంలో వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు బైరెడ్డి, ఫరూక్ సముక్షంలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బైరెడ్డి, ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి చెందాలన్నా పేదలకు సంక్షేమ పథకాలు, ఇంటి స్థలం పక్కా గృహం అందాలంటే టీడీపీతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలం కావడంతోనే ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

'టీడీపీతోనే యువతకు భవిష్యత్తు'


నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న బైరెడ్డి భారతమ్మ

నందికొట్కూరు ఏప్రిల్ 4: టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని సాధ్యమని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సతీమణి బైరెడ్డి భారతమ్మ అన్నారు. నందికొట్కూరు పట్టణంలో టీడీపీ తరుపున ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్న, రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా అది టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బంగారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 4: రాష్ట్రంలో కొనసాగుతున్న నియంతృత్వ పాలన నుంచి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ కూటమి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జయసూర్య మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రశ్నించిన దళితులు, బీసీలు ఇలా అన్ని వర్గాలకు చెందిన నాయకులను హత మార్చుతూ, కేసులు పెడుతూ దళిత, బీసీ వ్యతిరేకిగా వైసీపీ ప్రభుత్వం మారిందన్నారు. రాష్ట్రంలో 6వేలకు పైగా దళితులపై కేసులు పెట్టారని, 168 మంది దళితులను చంపారన్నారని ఆయన ఆరోపించారు. వైసీపీ నిరంకుశ నిర్వాకం వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందన్నారు. ఉమ్మడి పొత్తు ద్వారా సంపదను సృష్టించి రాష్ట్రాభివృద్ధికి సరికొత్త నాంది పలుకుతామన్నారు. జనసేన పార్టీ నియోకవర్గ నాయకులు రవికుమార్, బీజేపీ నందికొట్కూరు నియోకవర్గం ఇన్‌చార్జి అశ్వనికుమార్ పాల్గొన్నారు.

కన్నడ భక్తులకు వైద్య సేవలు

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 4: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీగిరి చెంతకు తరలివెళ్లే కన్నడ భక్తుల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాదయాత్ర మార్గాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ప్రత్యేకించి శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే కన్నడీగుల కోసం బైర్లూటి పీహెచ్‌సీ, కొట్టాల చెరువు పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో నల్లమలలోని పెచ్చెరువు, నాగలూటి వీర భద్రాలయం, భీముని కొలను ప్రాంతాల్లో పాదయాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. ఎస్ఆర్‌బీసీ, నంద్యాల టర్నింగ్, శ్రీపతిరావుపేట, వెంకటాపురం, పట్టణంలోని మలేరియా నిర్ధారణ కేంద్రం, వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే భక్తులకు పాదయాత్రలో ఆరోగ్యసమస్యలు తలెత్తితే సత్వర సేవలు అందించడానికి నాగలూటి గూడెం, పెచ్చెరువు ప్రాంతాల్లో 108 సేవలను అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌లు వెల్లడించారు.ఆయా శిబిరాల్లో ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి కన్నడిగులకు సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు.

● కన్నడ పాదయాత్రికుల కోసం పలువురు దాతలు పలు చోట్ల అన్నశిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం ఆత్మకూరు మండలం శ్రీపతిరావు పేట గ్రామ శివార్లలోని కేజి రోడ్డులో కర్నూలు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో కన్నడ పాదయాత్రికులకు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్లుగా ఈ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. అలాగే మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సభ్యులు ఆంజనేయులు, ఎల్‌వీఎస్ నాయుడు, రాజశేఖర్ రెడ్డి,గోపాల్ రెడ్డి, సదాశివగౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న కన్నడిగులకు స్థానిక పోలీసు స్టేషన్ వద్ద గురువారం ఆత్మకూరు పోలీసుశాఖ తరుపున డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్, అర్బన్ సీఐలు నాగభూషణ్, లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి'


ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

గడివేముల, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని గడివేముల, పెసరవాయి గ్రామాల్లో నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను భయాందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'అగ్రిగోల్డ్ బాధితులను పట్టించుకోని సీఎం'


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 4: రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చివరికి పట్టించుకోలేదని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం పట్టణ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ బాధితులకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల నుంచి వైసీపీకి వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ఆదం సాహెబ్, గౌరవఅధ్యక్షులు మనోహర్ రాజు, రామచంద్రగౌడ్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి వద్దే పింఛన్ అందించాలి'


మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 4: సామాజిక పింఛన్‌ను లబ్ధిదారులకు ఇంటివద్దే అందించే సదుపాయం కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో పింఛన్‌దారులకు పూర్తి అన్యాయం జరిగే పరిస్థితి ఉందని, దీంతో వారు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సచివాలయ సిబ్బంది ద్వారా పింఛనుదారుల ఇంటివద్దకు వెళ్లి పింఛన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో విష్ణు, రవి, సురేస్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఎన్నికల నిబంధనలు అమలులో ఉందని వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులకు పింఛన్ అందించడంలో ప్రభుత్వం కావాలనే తీవ్ర జాప్యం చేస్తోందని, ఇంటి వద్దే పింఛన్ అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు భాస్కర్‌రెడ్డి, పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వేళ పెన్షన్ పంపిణీని వలంటీర్లు చేయకూడదని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడంతో వైసీపీ ప్రభుత్వం పింఛన్ పంపిణీలో జాప్యం చేయడం దారుణమన్నారు. 3వ తేదీన సచివాలయం వద్ద పింఛన్ అందిస్తారని ప్రచార మధ్యమాల్లో తెలుసుకొని కొంత మంది పెన్షన్ దారులు మండుటెండల్లో వచ్చి సచివాలయం వద్ద అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలను పింఛన్ డబ్బులపై ఆధారపడి జీవిస్తున్న వారిపై ఇలా చేయడం బాధాకరమన్నారు. సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి'


ఎంఈవో జానకీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 4: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న ముందస్తు అక్రమ అడ్మిషన్లకు విద్యాశాఖ తరుపున అడ్డుకట్ట వేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు మద్రిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరులోని విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో-1 జానకీ రామ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా సంవత్సరం ఆరంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తూ అడ్మిషన్లను చేస్తున్నారని ఆరోపించారు. విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. అలాగే రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అటవీ అధికారుల అదుపులో వన్యప్రాణి వేటగాళ్లు..?


నిందితులను తీసుకెళ్తున్న అటవీ అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 4: నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడిన పలువురు వేటగాళ్లను గురువారం రాత్రి ఆత్మకూరు అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొంతమంది వేటాగాళ్లు నల్లమలలో ఓ ఎలుగుబంటిని హతమార్చి వాటి అవయవాలను అక్రమ రవాణా చేస్తున్నట్లు అటవీ అధికారులకు పక్కా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో వన్యప్రాణి వేటాగాళ్లు ఆత్మకూరు పట్టణ శివార్లలోని సూర్య గ్రాండ్ లాడ్జిలో మకాం వేసినట్లు తెలియడంతో నిందితులను పకడ్బందీగా పట్టుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబాతో సహా ఇద్దరు రేంజర్లు, సుమారు 30మంది దాకా అటవీ సిబ్బంది వాహనాల్లో హుటాహుటిన అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మొత్తానికి పట్టుబడిన నిందితులను విచారించి వన్యప్రాణుల మాంసాన్ని ఎక్కడి తరలిస్తున్నారు, ఇందులో సూత్రధారులెవరూ వంటి విషయాలపై అటవీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల వినికిడి. ఇదిలావుంటే ఈఘటనకు సంబంధించి అటవీ అధికారులు ఎలాంటి సమాచారం వెలువరించకపోవడం గమనార్హం.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా పవిత్రోత్సవం



శివరామానంద ఆశ్రమంలో హోమం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఏప్రిల్ 4: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో గురువారం శంకరానంద స్వామి 54వ ఆరాదన ముగింపు సందర్భంగా అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో దంపతులు, మహిళలతో కలశ స్థాపన, పవిత్రోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. గణపతి హోమం, దీపారాధన పూజలు చేశారు. కళాకారులతో భజన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయివ్రతం

చాగలమర్రి, ఏప్రిల్ 4: చాగలమర్రి గ్రామంలోని సాయినాధ మందిరంలో గురువారం మహిళలు సామూహికంగా సాయివ్రతం, క్షీరాభిషేకం చేశారు. వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు. అనంతరం పల్లకీలో ఊరేగింపు చేశారు. మూడురాళ్లపల్లె గ్రామంలో సాయిబాబాకు మహిళలు క్షీరాభిషేకం, కలశ స్థాపన పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు చందలూరులో విగ్రహానికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

మేజర్ పంచాయతీ ఈవోగా ప్రకాశం

చాగలమర్రి, ఏప్రిల్ 4: చాగలమర్రి మేజర్ పంచాయతీ ఈవోగా గురువారం బనగానపల్లె మండలం మీరాపురం పంచాయతీ నుంచి పదోన్నతిపై ఈవోగా వచ్చిన ప్రకాశం గురువారం చాగలమర్రి ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. చాగలమర్రి ఈవోగా పని చేస్తున్న సుదర్శన్ గుండెపోటుతో మృతి చెందడంతో ఇన్‌చార్జి ఈవోగా నాగమణి విధులు నిర్వహించారు. రెగ్యులర్ ఈవోగా ప్రకాశం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఏప్రిల్ 4: చాగలమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంఈవో అనూరాధ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, నాణ్యమైన కోడిగుడ్లు ఇవ్వాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి విజయవంతం చేయాలన్నారు. చాగలమర్రి బాలుర, బాలికల, మద్దూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులకు రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఈ నిధులతో పనులు వేగవంతం చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జైలాబ్దీన్, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థినికి మెటీరియల్ అందజేస్తున్న అధ్యాపకుడు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 4: బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి, జంతుశాస్త్ర శాఖ అధ్యాపకుడు మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో డిగ్రీ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీయరిల్ గురువారం పంపిణీ చేశారు. జంతుశాస్త్ర అధ్యాపకుడు మహమ్మద్‌గౌస్ కళాశాల విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలకు, పీజీ పరీక్షలకు పనికివచ్చేలా తయారు చేసి ఇచ్చారు. ప్రిన్సిపాల్ మాట్లాడతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాబూనాథ్, ఉమామహేశ్వరరెడ్డి, రవికుమార్, కౌసల్యాదేవి, వహిదా తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ యువ నాయకుడికి పరామర్శ



చంద్రమౌళీశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 4: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మోటారుసైకిల్ ప్రమాదంలో మూడు రోజుల క్రితం గాయపడిన యాగంటిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు చంద్రమౌళీశ్వరరెడ్డిని గురువారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొంది యాగంటి పల్లెలో విశ్రాంతి తీసుకుంటున్న మౌళీశ్వరరెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని రాజారెడ్డి అడిగి తెలుసుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఏప్రిల్ 4: శ్రీశైల దేవస్థానం ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా క్షేత్రపరిధిలోని నిత్యకళారాధన వేదిక, ఆలయ పుష్కరిణి వేదిక, శివదీక్షా శిబిరాల వేదికల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనం (కన్నడ), భజన, భక్తిరంజని(కన్నడ), సంప్రదాయనృత్యం, గిరిజా కల్యాణం, నృత్యరూపకం, కథక్, భరతనాట్యం తదితర కార్యక్రమాలకు కళాకారుల ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

తల్లీకొడుకుల అదృశ్యం

మిడుతూరు ఏప్రిల్ 4: మిడుతూరు గ్రామానికి చెందిన తల్లీ కొడుకులు అదృశ్యమయ్యారు. మిడుతూరు గ్రామానికి చెందిన 35 ఏళ్ల మరియమ్మ 13ఏళ్ల చరణ్ కనిపించడం లేదని భర్త ఏసోబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు.

వైసీపీకి షాక్

● బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు

బనగానపల్లె, ఏప్రిల్ 4: చిన్నరాజుపాలెం, జోళాపురం గ్రామాలకు చెందిన కీలక వైసీపీ నాయకులు, కార్యకర్తలు 30 కుటుంబాలు వైసీపీని వీడి గురువారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు నరసింహులు, కృష్ణనాయక్, రామాంజనేయులు ఆధ్వర్యంలో దూదెకుల ఉశేన్ సాహెబ్, పోతుగంటి దస్తగిరి, జోళాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు, బాలకృష్ణ తదితర 30 కుటుంబాలు వారు టీడీపీ చేరాయి.

● పట్టణంలోని ఖాజీవాడాలో ముస్లీం మైనారిటీ నాయకులు అన్వర్‌సాహెబ్ ఆహ్వానం మేరకు ముస్లింలతో కలిసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. పట్టణ మైనారిటీ నాయకులు అల్తాఫ్ హుసేన్, అహ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని దొరకోటలోని బనగానపల్లె నవాబు వంశీయుడు మీర్‌ఫజుల్ అలీఖాన్‌తో బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం బేటీ అయ్యారు. ఆయనను మర్యాద పూర్వకంగా బీసీ కలుసుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు, పాల్గొన్నారు.

అవుకు: అవుకు పట్టణంలో వైసీపీకి షాక్ తగిలింది. అవుకు పట్టణం తెలుగుపేటకు చెందిన 70 బెస్త కుటుంబాలు వైసీపీని వీడి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపలో చేరాయి. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని తుంగలో తొక్కిందని ఆరోపించారు. అభివృద్ధిలేక పరిశ్రమలు రాక యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారిన



టీడీపీలో చేరిన మీర్జాపురం వైసీపీ నాయకులు

ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించి కష్ట సుఖాల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, వెంకటరమణనాయక్, ఇస్మాయిల్‌ఖాన్, దంతెల రమణ, తిక్కన్న, వెంకటరాముడునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● అవుకు పట్టణ మాజీ ఎంపీటీసీ మిద్దె ప్రసాద్, వార్డు సభ్యుడు అక్కప్పగారి శ్రీనివాసులు గురువారం వైసీపీని వీడి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే వైసీపీకి చెందిన మిద్దె రామాంజి, సుబ్రమణ్యం, రామకృష్ణ, గొడుగునంది, రామాంజనేయులు, కుళాయి, కోనేటి బ్రదర్స్, వారి అనుచరుల కుటుంబాలకు బీసీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.

కొలిమిగుండ్ల రూరల్: కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన 12 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. చిన్నపురెడ్డి, కొలిమిగుండ్ల మాజీ సర్పంచ్ సీతారామయ్య ఆధ్వర్యంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. రంగస్వామి, వెంకటనరసింహనాయుడు, నరసింహుడు, కంబగిరిరాముడు, వెంకటరాముడు, పాండు, బాలాంజనేయులు, రాముడు, నారాయణ, దస్తగిరి, తదితరులు టీడీపీలో చేరారు.

ప్రజలకు నరకం చూపించిన జగన్

● డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 4: మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన నియంతృత్వ పోకడలతో ఐదేళ్ల పాటు ప్రజలకు నరకం చూపించారని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జనసేన, టీడీపీ బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘవేంద్రరెడ్డితో కలిసి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాటు సీఎం జగన్ అసలు ప్రజలతో కలవకుండా తాడేపల్లి ప్యాలేస్‌కే పరిమితం కావడం దారుణమన్నారు. ఇప్పటి వరకు దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా పాలన చేయలేదన్నారు. సీఎం జగన్ బయటకు వస్తే.. పరదాలు కట్టడం, చెట్లను నరికేసే సంస్కృతి నియంతృత్వ పాలనకు నిదర్శనమన్నారు. సీఎం జగన్ ప్రజలను ఏ మాత్రం కలవకుండా తన అరాచక విధానాలతో రాష్ట్ర ప్రజలకు నరకం చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు అడిగేందుకు ఇప్పుడు జగన్ వస్తుంటే.. జనం పారిపోతున్నారన్నారు. లిక్కర్, ఇసుక వ్యాపారాల్లో సీఎం జగన్, మంత్రులు భారీ స్కామ్‌లకు పాల్పడ్డారని ఆరోపించారు. డోన్ నియోజకవర్గంలో అభివృదద్ధి చేసి ఉంటే.. మంత్రి బుగ్గన ప్రజల్లో ఎందుకు ధైర్యంగా తిరగలేకపోతున్నారని ప్రశ్నించారు. పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని బుగ్గన టీడీపీ నాయకులను, కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. డోన్ డీఎస్పీతో పాటు ఇద్దరు సీఐలపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ప్రజలకు, డోన్ నియోజకవర్గ ప్రజలకు బుగ్గన చేసిన మోసాలను తెలుసుకున్నారన్నారు.



కోట్ల దంపతులకు పూలబొకే అందజేస్తున్న మురళీకృష్ణగౌడు

సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ నాయకులు మురళీకృష్ణగౌడు, టీఈ కేశన్నగౌడు, కేశవయ్యగౌడు, విజయభట్టు, శేషిరెడ్డి, ధర్మవరం చిన్న నాగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ఎస్‌ఎండీ రఫి, బీజేపీ నాయకులు వడ్డే మహారాజ్, దామోదర్ నాయుడు, జనసేన నాయకులు బ్రహ్మం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశం చేసిన కోట్ల

పట్టణంలో గురువారం టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కూతుళ్ల కోట్ల నివేధితలతో కలిసి గృహ ప్రవేశం చేశారు. స్థానికంగానే నివాసం ఉండేందుకు కోట్ల దంపతులు గృహ ప్రవేశం చేశారు.

● టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్



ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న కలెక్టర్

నంద్యాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమ నిబంధనలను పకబ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్వో, ఏఆర్వోల టీంలైన ఎఫ్‌ఎస్టీ, వివిటి, ఎంసీసీ, ఆడిట్ టీంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ బృందాలన్నీ సంబంధిత రికార్డులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి, ఏఆర్వో నజీర్ అహమ్మద్, డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘనంగా కోట్ల సుజాతమ్మ జన్మదిన వేడుకలు

ప్యాపిలి, ఏప్రిల్ 3: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, టీడీపీ శ్రేణులు బర్త్‌డే కేక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. కోట్ల శ్రీనాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, అంకిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, చల్లా వీరాంజినేయులు, గండికోట పెద్దరామాంజినేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షిక పరీక్షలు

చాగలమర్రి, ఏప్రిల్ 4: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శనివారం నుంచి వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. గురువారం చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో జిల్లా నుంచి వచ్చిన ప్రశ్న పత్రాలను భద్రపరిచారు. ప్రశ్న పత్రాలను తరగతుల వారిగా కేటాయించారు. ప్రతి రోజు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రశ్నపత్రాలు అందజేస్తామన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు ఆదేశించారు.

'టీడీపీతోనే మహిళా సంక్షేమం'



యనకండ్లలో కరపత్రాలు అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 4: టీడీపీతోనే మహిళా సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బీసీ స్వగ్రామం యనకండ్లలో గురువారం సాయంత్రం బీసీ ఇందిరమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న బీసీ ఇందిరమ్మకు టీడీపీ నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీ ఇందిరమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ చంద్రబాబు హామీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబు అధికారంలో వస్తే అమలు చేసే పథకాల గురించి వివరింఆచరు. నాయకులు మదనభూపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి,దివాకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని ఇస్రానాయక్ తండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ నాయకురాలు బీసి ఇందిరమ్మ, కునుకుంట్ల టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, విగ్రహప్రతిష్ట కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు భక్తులకు మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు అందించారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

డోన్(రూరల్), ఏప్రిల్ 4: శాంతిభద్రతల దృష్ట్యా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంటుందని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలలో వ్యక్తిగతంగా, రాజకీయంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల విషయంలో అడ్మిన్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

300 మంది బైండోవర్

రుద్రవరం, ఏప్రిల్ 4: పోలీసు సర్కిల్‌లోని రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లో 300 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ చంద్రబాబు గురువారం తెలిపారు. రుద్రవరం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పది మంది బెల్టుషాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేశామని చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శిరివెళ్ల మండలంలో సమస్యాత్మక గ్రామాలు గోవిందపల్లె, శిరివెల్ల, ఎర్రగుంట్ల, రుద్రవరం మండలంలో ఆలమూరు, ఎర్రగుడిదిన్నె గ్రామాలుగా గుర్తించామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్‌ను పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజేఏసీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సీజేఏసీ అధ్యక్షులు, సభ్యులు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 4: క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్లు, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బనగానపల్లె మండల సీజేఏసీ ప్రెసిడెంట్ పాస్టర్ మనోజ్ తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని ఏలియా హోసన్న మందిరంలో బిషప్ డాక్టర్ జాషువా దానియేలు చెగుడి అధ్యక్షతన గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో సీజేఏసీ నేషనల్ ప్రెసిడెంట్, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పాస్టర్ మాధనీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తగా నాలుగు మండల సీజేఏసీ ప్రెసిడెంట్లు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్యాపిలి పాస్టర్ రాజారత్నం, యాపదిన్నె పాస్టర్ మత్తయ్యా, రామాపురం పాస్టర్ సువార్త, అవుకు పాస్టర్ లోకేష్‌ను ప్రెసిడెంట్లుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోవెలకుంట్ల , ఏప్రిల్ 4: కోవెలకుంట్ల నుంచి ముదిగేడుకు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దస్తగిరి అనే వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు బంధువులు తెలిపిన వివరాలివీ.. సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి బైక్‌పై కోవెలకుంట్లకు వెళ్తుండగా కోవెలకుంట్ల సమీపంలో వచ్చేసరికి ఎటుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన దస్తగిరిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'వైసీపీ పతనం ఖాయం'

రుద్రవరం, ఏప్రిల్ 4: వైసీపీ పతనం ఖాయమని టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామనాయుడు అన్నారు. గురువారం ఆలమూరు, కొత్తపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఆర్.కొత్తూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

● ఆలమూరు, ఆర్.కొత్తపల్లెలో వైసీపీకి షాక్ తగిలింది. ఆలమూరు గ్రామంలో వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆర్.కొత్తపల్లె గ్రామంలో పది కుటుంబాలకు పైగా టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకులు నారాయణ, వేణుగోపాల్, గురుమూర్తి, మనోహర్‌రెడ్డి, రాజారావు, చంద్రశేఖర్, కాంత్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం తప్పదు

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ



నర్సిపల్లెలో టీడీపీలో చేరిన నాయకులతో అఖిలప్రియ

చాగలమర్రి, ఏప్రిల్ 4: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం చాగలమర్రి శ్రీనివాసనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకుల అరాచకాలు, దాడులతో ప్రజలు విసుగు చెంది టీడీపీలో చేరుతున్నార న్నారు. టీడీపీ నాయకులు అన్సర్ బాషా, ఉసేన్‌వలి, షరీఫ్, నాగరాజు, మౌళాలి, అనీఫ్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తమ సొంత మండలమైన ఉయ్యాలవాడ రైతులకు సాగునీరు అందించలేకపోయారని టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ విమర్శించారు. గురువారం నర్సిపల్లెలో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. అలాగే తాము అధికారంలో ఉన్నప్పుడు మయలూరు గ్రామంలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ఎంతో కృషి చేశామన్నారు. ఎంపీ మాత్రం స్టేషన్ ఏర్పాటుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. గ్రామాల్లో తిరగటానికి ఎంపీ, ఎమ్మెల్యేలు భయపడుతున్నారనారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తారని వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

● ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సమక్షంలో మండలం లోని నర్సిపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, పెద్దతిమ్మారెడ్డి, చిన్నతిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ బాషాతో పాటు మరో 25 మంది పార్టీ కండువా కప్పుకున్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, పల్లె బాబుల్‌రెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రిలో ఇఫ్తార్

చాగలమర్రి, ఏప్రిల్ 4: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు గురువారం రాత్రి చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో దూదెకుల నూర్‌బాషా సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా ప్రారంభించారు. ఉపవాస దీక్షలు ఉంటున్న ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, దూదెకుల నూర్‌బాషా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

● రాత్రికి రాత్రే తరలింపు ● చోద్యం చూస్తున్న అధికారులు



ఆలమూరు చెరువులో మట్టి తవ్విన గుంతలు

రుద్రవరం, ఏప్రిల్ 4: రుద్రవరం మండలం ఆలమూరు చీలబోయిన చెరువులో అక్రమంగా మట్టి తవ్వి రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పు మట్టి రూ.800 నుంచి వెయ్యి విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. ఒక్కో రాత్రి 200 నుంచి 300 ట్రిప్పులు మట్టి తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వుతున్నా మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలమూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు మట్టి రవాణా చేస్తున్నారు. ఇలా ప్రతిరోజూ రాత్రయితే అక్రమంగా మట్టి తవ్వకాలు షురూ అవుతున్నాయి.

దొళ్లవాగులో 20 అడుగులలో తవ్వి..

ఆలమూరు సమీపంలోని దొళ్లవాగులో 20 అడుగుల లోతు తెల్లసుద్ద మట్టి తవ్వి అక్రమంగా రవాణా చేశారు. దొళ్లవాగు పక్కనే పంట పొలాల రైతులు తమ పొలా వద్దకు వెళ్లాలంటే ప్రమాదకరంగా గుంతలు మారాయని ఆందోళన చెందుతున్నారు. 20 అడుగులలోతు మట్టి తవ్వారు. ఈగుంతలు వాగుల్లో ప్రమాదకరంగా మారాయి.

అధికార అండతో..

అధికారాన్ని అండగా చేసుకుని అక్రమంగా మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రయితే చెరువులు వాగులు వంకల్లో అక్రమంగా మట్టి తవ్వి రవాణా చేస్తున్నారు

అనుమతి ఇవ్వలేదు

చెరువులు, వాగుల్లో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. అలా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.



ఆలమూరు చెరువు గట్టుకు గండి కొట్టిన దృశ్యం



దొళ్లవాగులో 20 అడుగుల లోతు తవ్విన గుంతలు